సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాజయ్య

రేవంత్‌రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే ఎస్సీ వర్గీకరణపై ఆర్డినెన్స్ జారీ చేయాలి

మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య

స్టేషన్ ఘన్‌పూర్, ఫిబ్రవరి 3 : సీఎం రేవంత్‌రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే ఎస్సీ వర్గీకరణపై వెంటనే ఆర్డినెన్స్ జారీ చేయాలని మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య డిమాండ్ చేశారు. సోమవారం డివిజన్ కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సుప్రీంకోర్టు తీర్పు అనంతరం ఎస్సీ వర్గీకరణకు కట్టిబడి ఉన్నానని చెప్పిన రేవంత్‌రెడ్డి కమిటీల పేరుతో కాలయాపన చేస్తున్నారని రాజయ్య విమర్శించారు. వర్గీకరణ విషయంలో మాదిగలను పొగుడుతూనే, దీనిని అడ్డుకునేందుకు మాలలను ప్రోత్సహిస్తున్నారని మండిపడ్డారు. మాలల చేతిలో సీఎం రేవంత్‌రెడ్డి కీలు బొమ్మగా మారాడని ఎద్దేవా చేశారు. మాదిగ సామాజిక వర్గంలో 59 ఉప కులాలు ఎస్సీ వర్గీకరణ కోసం పోరాడుతుంటే, కేవలం మాలలు మాత్రమే అడ్డుకుంటున్నారని ఆయన వివరించారు. మాయ మాటలతో అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి తన 13 నెలల పాలనలో ప్రజలకు మేలు చేసింది ఏమీ లేదన్నారు. ఎస్సీ నియోజకవర్గమైన స్టేషన్‌ఘన్‌పూర్‌కు ఎమ్మెల్యేగా ఉన్న కడియం శ్రీహరి వర్గీకరణ విషయంలో పెద్దన్నగా వ్యవహరించాలని రాజయ్య సూచించారు. ఈ విలేకరుల సమావేంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మాచర్ల గణేశ్, కూడా మాజీ డైరెక్టర్ ఆకుల కుమార్, మాజీ జడ్పీటీసీ రవి, మాజీ సర్పంచ్ సురేశ్‌కుమార్, నాయకులు కుమార్‌గౌడ్, ఏసుబాబు, హీరాసింగ్, చిట్టిబాబు, మారపల్లి ప్రసాద్, మల్లేశ్, బాబు, గోవిందు అశోక్, గుర్రం శ్రీను, బంగ్లా శ్రీను, ఉడుముల భాగ్య పాల్గొన్నారు.



అరూరి రమేశ్‌ను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే రాజయ్య

మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేశ్‌కు మాతృ వియోగం

జఫర్‌గఢ్, ఫిబ్రవరి 3 : మండలంలోని ఉప్పుగల్లుకు చెందిన వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేశ్ తల్లి ఆరూరి వెంకటమ్మ అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న స్టేషన్ ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి వేర్వేరుగా ఉప్పుగల్లులో వెంకటమ్మ పార్థివ దేహాన్ని సందర్శించి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేశ్‌ను, కుటుంబ సభ్యులను వారు పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నరేశ్‌గౌడ్, ధనుంజయ్ తదితరులున్నారు.

ఎమ్మెల్యే పల్లా సాయంతో బాధితుడికి వైద్యం

చికిత్స పొందుతున్న కట్టయ్యను పరామర్శిస్తున్న బీఆర్ఎస్ మండల నాయకులు

చిల్పూరు, ఫిబ్రవరి 3 : మండలంలోని పల్లగుట్టకు చెందిన నిరుపేద గాడుదల కట్టయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడగా జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి చేయూత నిచ్చి వైద్యం చేయించారు. వివరాల్లోకి వెళ్తే.. కట్టయ్య ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడగా బాధితుడిని హైదరాబాద్‌లోని యశోద హాస్పిటల్‌లో చేర్పించారు. వైద్య ఖర్చులు రూ.15 లక్షలు దాటినా నయంకాకపోవడంతో దీనిపై బీఆర్ఎస్ నాయకులు ఉడుత అశోక్ యాదవ్, కేశిరెడ్డి రాకేశ్‌రెడ్డి బాధితుడి సమస్యను ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి దృష్టికి తెచ్చారు. వెంటనే స్పందించిన ఆయన నీలిమ ఆస్పత్రిలో చేర్చి ఉచితంగా వైద్యం అందించారు. ఈ నేపథ్యంలో చికిత్స పొందుతున్న కట్టయ్యను బీఆర్ఎస్ నాయకులు కేశిరెడ్డి రాకేశ్‌రెడ్డి, జనగామ యాదగిరి, ఉడుత అశోక్, ఎడ్ల రాజేశ్ సోమవారం పరామర్శించారు. నిరుపేద కట్టయ్యకు చేయూతనందించిన ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

BUILDING FOR SALE

★H.No: 2-6-75, Circuit House, Nakalgutta Hanamkonda, Ground floor Bldg, 160.7 Sq.yds, 1000 sqft RCC buildup area, East Facing, 1.15 Cr. Clear tittle, Brokers pls excuse. **Contact: 9949912347, 999896 12347, 63025 53816.**

NTW-000

CHANGE OF NAME

★I, **Seelam Mani Chandana** (NEW NAME), R/O H. No 4-42, Narashimhula Gudem Village, Kusumanchi Mandal, Khammam Dist, 507159 Telangana State, India, changed my name from **Seelam Dimple** (OLD NAME) to **Seelam Mani Chandana** (NEW NAME) for all purposes.

NTW-000

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య

రవి (ఫైల్)

చిల్పూరు, ఫిబ్రవరి 3 : ఆర్థిక ఇబ్బందులతో యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని కొండాపూర్ శివారు ఎర్రకుంట తండాలో జరిగింది. ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్ తెలిపిన వి వరాల ప్రకారం.. ఎర్రకుంటతండాకు చెందిన గుగులోత్ రవి(38) కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాడు. గత నెల 31వ తేదీన విషగుళికలు మింగి స్పృహ తప్పి పడిపోగా స్థానికుల సాయంతో వరంగల్‌లోని ఎంజీఎం దవాఖానలో చేర్చారు. రవి చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడని ఎస్సై తెలిపారు.

ఏడు ఇసుక ట్రాక్టర్ల సీజ్

పోచమ్మమైదాన్, ఫిబ్రవరి 3: ఇసుక అక్రమంగా తరలిస్తున్న ఏడు ఇసుక ట్రాక్టర్లను వరంగల్ తహసీల్దార్ ఎండీ ఇక్బాల్ సోమవారం సీజ్ చేశారు. తనిఖీల్లో స్వాధీనం చేసుకున్న ఇసుక ట్రాక్టర్లను కార్యాలయానికి పంపి, మట్టెవాడ పోలీస్‌స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ చేశారు. ఒక్కో ట్రాక్టర్‌కు జరిమానా విధించి చలాన్ ద్వారా చెల్లింపులు చేయించామని తహసీల్దార్ తెలిపారు. సీజ్ చేసిన ఇసుకను కార్యాలయం ఆవరణలో డంప్ చేయించామని, ఈ ఇసుకపై ఈనెల 5న మధ్యాహ్నం 2 గంటలకు వేలం నిర్వహిస్తామని పేర్కొన్నారు. వేలంలో పాల్గొనే వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నులి పురుగుల నివారణకు కృషి చేయాలి

అధికారులతో సమీక్షలో కలెక్టర్ షేక్‌రిజ్వాన్‌బాషా

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ షేక్‌రిజ్వాన్‌బాషా

జనగామ చౌరస్తా, ఫిబ్రవరి 3 : నులి పురుగుల నివారణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. సోమవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్‌హాల్లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పింకేశ్ కుమార్‌తో కలిసి ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 10వ తేదీ నుంచి జిల్లాలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కళాశాల లు, వసతి గృహాలు, గురుకులాల్లోని విద్యార్థులకు నులి పురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేయాలని కోరారు. ఆరు నెలలకొకసారి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నులి పురుగుల సంక్రమణను నిరోధించడంలో అల్బెండజోల్ మాత్రలు పని చేస్తాయని షేక్‌రిజ్వాన్‌బాషా తెలిపారు. 1 నుంచి 19 ఏళ్ల వయసున్న పిల్లలు, యువకులకు ఈ మాత్రలు ఇవ్వాలని సూచించారు. మండల స్థాయిలో ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, సీడీపీవోలు, పంచాయతీ కార్యదర్శులతో, అలాగే మున్సిపాలిటీల్లో సూపర్‌వైజర్లు, మెప్మా ఆర్పీలతో సంయుక్తంగా సమావేశాలు నిర్వహించాలన్నారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో పీహెచ్‌సీ డాక్టర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తప్పనిసరిగా ఉండాలని కలెక్టర్ సూచించారు. 10వ తేదీన మాత్రలు వేసుకోని వారుంటే 17న మాప్ అప్ రోజుగా నిర్వహించాలని సూచించారు. అనంతరం ప్రచార వాల్‌పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మల్లికార్జున్‌రావు, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, డీఈవో రమేశ్, డీడబ్ల్యూవో ఫ్లోరెన్స్, డీపీవో స్వరూప, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి విక్రమ్, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీదేవి, పీవో స్వర్ణకుమారి, భాస్కర్, డాక్టర్ శ్యామ్‌కుమార్, ఆర్బీఎస్కే నోడల్ అధికారి శ్రీవాణి, జైపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి దివ్యాంగుల ఎంపిక శిబిరాలు

హైదరాబాద్‌లోని ఆలింకో సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలో నేటి నుంచి ఈ నెల 6వ తేదీ వరకు అర్హులైన దివ్యాంగులు, వయో వృద్ధులను గుర్తించి వారికి అవసరమైన సహాయ ఉపకరణాలను పంపిణీ చేసేందుకు శిబిరాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 4న స్టేషన్ ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలోని రైతువేదిక వద్ద చిల్పూరు, జఫర్‌గఢ్, రఘునాథపల్లి, స్టేషన్ ఘన్‌పూర్ మండలాల దివ్యాంగులు, వయో వృద్ధులకు శిబిరం జరుగుతుందని తెలిపారు. 5న పాలకుర్తి మండలం ముత్తారంలోని రైతువేదిక వద్ద పాలకుర్తి, దేవరుప్పుల, కొడకండ్ల మండలాలకు చెందిన దివ్యాంగులు, వృద్ధులకు ఎంపిక శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 6వ తేదీన జిల్లా కలెక్టరేట్‌లోని దివ్యాంగుల సంక్షేమశాఖ కార్యాలయంలో జనగామ అర్బన్, రూరల్, లింగాల ఘనపురం, తరిగొప్పుల, బచ్చన్నపేట, నర్మెట మండలాలకు చెందిన దివ్యాంగులు, వయో వృద్ధులకు శిబిరం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. శిబిరానికి హాజరయ్యే దివ్యాంగులు, వృద్ధులు తమ ఒరిజినల్ సదరం సర్టిఫికెట్ (40 శాతం), ఆదాయం, రేషన్, ఆధార్ కార్డుల ధ్రువీకరణ పత్రాలతో పాటు రెండు కలర్ పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు తీసుకు రావాలన్నారు. గత ఐదేళ్ల కాలంలో దివ్యాంగుల సంక్షేమ శాఖ ద్వారా లబ్ధి పొందని వారు మాత్రమే ఉపకరణాలు పొందడానికి అర్హులని కలెక్టర్ పేర్కొన్నారు.

గ్రామైక్య సంఘాల్లో అవకతవకలపై అధికారుల విచారణ

55 సంఘాల్లో పూర్తయిన ఆడిటింగ్

వడిచర్లలో విచారణ జరుపుతున్న అధికారులు

లింగాలఘనపురం, ఫిబ్రవరి 3 : మండలంలోని వడిచర్ల గ్రామైక్య సంఘాల్లో అవకతవకలపై ఐకేపీ అధికారులు నెలరోజులుగా విచారణ కొనసాగిస్తున్నారు. అంకిత, మదర్‌థెరిసా గ్రామైక్య సంఘాల పరిధిలో మొత్తం 59 మహిళా పొదుపు సంఘాలున్నాయి. సోమవారం వరకు 55 సంఘాల్లో ఆడిటింగ్ పూర్తి కాగా, మిగిలిన నాలుగు సంఘాల్లో విచారణ కొనసాగుతున్నది. సుమారు రూ.60 లక్షల వరకు అక్రమాలు జరిగినట్లు సమాచారం. అంకిత గ్రామైక్య సంఘానికి వీవోఏ(విలేజ్ ఆర్గనైజర్ అసిస్టెంట్)గా బేతి ప్రభాకర్ పని చేస్తున్నారు. ఆయన బీసీ పాయింట్ కేంద్రాన్ని(బిజినెస్ కరెస్పాండెంట్ పాయింట్ కస్టమర్లకు బ్యాంకు సేవలందించే కేంద్రం) నిర్వహిస్తున్నారు. మరో గ్రామైక్య సంఘం మదర్‌దెరిసాకు వీవోఏగా నగ్మా సేవలను అందిస్తున్నారు. వీటి పరిధిలో మొత్తం 625 మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు. వీరంతా సంఘాల్లో పొదుపు చేసుకుంటూ, శ్రీనిధి రుణాలు తీసుకుంటున్నారు. సంఘాల పేర తీసుకున్న రుణం తక్కువగా ఉంటే ఎక్కువగా ఎవరికీ తెలియకుండా రుణాలు తీసుకోవడం వంటివి ఉన్నాయి. శ్రీనిధి రుణాలు చెల్లించకుండా సంఘాల నుంచి బదిలీ చేయడం తదితర అవకతవకాలు జరిగాయని ఆరోపణలున్నాయి. నెల క్రితం ఓ సంఘంలో జరిగిన అవకతవకలు బయట పడడంతో ఐకేపీ అధికారులు విచారణ చేపట్టారు. తవ్విన కొద్దీ అక్రమాలు బయట పడుతున్నాయి. సుమారు రూ.60 లక్షలకు పైగానే కుంభకోణం జరిగినట్లు ప్రచారం జరుగుతోంది.మిగిలిన నాలుగు సంఘాల ఆడిటింగ్ పూర్తయితే సమగ్ర సమాచారం వెలుగు చూసే అవకాశముంది.

కురమ సంఘం మండల అధ్యక్షుడిగా బీరప్ప

చిల్పూరు, ఫిబ్రవరి 3 : కురుమ సంఘం మండల అధ్యక్షుడిగా మండలంలోని మల్కాపూర్‌కు చెందిన కట్ట బీరప్ప ఎన్నికయ్యారు. సోమవారం నిర్వహించిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. బీరప్ప మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించినందుకు సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. జిల్లా గౌరవాధ్యక్షుడు మేకల మల్లేశం, అధ్యక్షుడు కంచ రాములుకు ఆ యన కృతజ్ఞతలు తెలిపారు. కురుమలు ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాలని ఆ యన కోరారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కురుమలకు ప్రాధాన్యమివ్వాలని వివిధ పార్టీలకు విజ్ఞప్తి చేశారు.

ఆర్థిక సాయం అందిస్తున్న నాయకులు

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

చిల్పూరు, ఫిబ్రవరి 3 : మండలంలోని పల్లగుట్ట శివారు మారుపెల్లిగూడేనికి చెందిన గుర్రపు పాపయ్య అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న చిల్పూరు దేవస్థాన చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు మృతుడి కుటుంబాన్ని పరామర్శించి రూ. 5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. సొసైటీ మాజీ వైస్ చైర్మన్ చిర్ర నాగరాజు, చిల్పూరు దేవస్థానం డైరెక్టర్ రత్నాకర్‌రెడ్డి, నాయకులు ధార రాజు, ఇసురం యేసు, అశోక్ పాల్, రజినీకుమార్ పాల్గొన్నారు.

ఆలయాల్లో ఘనంగా వసంత పంచమి వేడుకలు

పాలకుర్తిలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న అర్చకుడు

పాలకుర్తి/దేవరుప్పుల, ఫిబ్రవరి 3: వసంత పంచమి వేడుకలను పురస్కరించుకుని సోమవారం పాలకుర్తిలోని సోమే శ్వర లక్ష్మీనరసింహస్వామి ఆలయంతోపాటు చండీమాత ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. ఆనంతరం కొడకండ్ల మం డలం జీబీ తండాకు చెందిన గుగులోత్ రామకృష్ణ–కౌసల్య దంపతులు భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి సల్వాది మోహన్‌బాబు, సూపరింటెండెంట్ కొత్తపల్లి వెంకటయ్య, ముంజాల రాములు, అర్చకులు డీవీఆర్ శర్మ, లక్ష్మన్నశర్మ, అనిల్ శర్మ, నాగరాజ శర్మ పాల్గొన్నారు. మరోవైపు దేవరుప్పుల మండల కేం ద్రంలోని వాసవీ కన్యాకాపరమేశ్వరి ఆలయ ప్రాంగణంలోని చండీ పీఠంలో సోమవారం వసంత పంచమి వేడుకలు నిర్వహించారు. ఆచార్యులు అవసరాల ప్రసాదశర్మ చిన్నారులకు అక్షరాభ్యాసం చే యించారు. సాయి ప్రశాంతి విద్యానికేతన్ కరెస్పాండెంట్ తోటకూరి పాండు కృష్ణ తన పాఠశాలలో చేరిన విద్యార్థులకు అక్షరాభ్యాసం చేయించారు. ఈ కార్య క్రమంలో ప్రిన్సిపాల్ స్వప్న పాల్గొన్నారు.

దేవరుప్పుల, జఫర్‌గఢ్‌లో మహాప్రదర్శన వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఎమ్మార్పీఎస్ మహాప్రదర్శనను విజయవంతం చేయాలి

దేవరుప్పుల/జఫర్‌గఢ్, ఫిబ్రవరి 3: ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఈ నెల 7న హైదరాబాద్‌లో జరిగే భారీ సాంస్కృతిక ప్రదర్శన పోస్టర్‌ను సోమవారం మండల కేంద్రంలో ఆ సంఘం మండల అధ్యక్షుడు పడమటింటి నర్సింహ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ నేతృత్వంలో లక్ష డప్పులు, వేయిగొంతుల పేర జరుగుతున్న ర్యాలీకి మాదిగలందరూ తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొంగరి రాములు, జోగు సుదర్శన్, జోగు మధుసూదన్, దౌపాటి నర్సయ్య, వంగల శ్రీనివాస్, దౌపాటి మల్లయ్య, ఉప్పుల ముత్తయ్య, చింత పరుశరాములు, భువనగిరి సోమబయ్య, జేరిపోతుల రాములు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా జఫర్‌గఢ్ మం డల కేంద్రంలో ఎమ్మార్పీస్, ఎమ్మెస్పీ నాయకులు మహాప్రదర్శన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఎమార్పీఎస్ నేత ఆదాం మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ అమలు కోసం మాదిగలు, ఉప కులాలవారు డప్పులతో తరలిరావాలని కోరారు. వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కారు అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఇల్లందుల రాంబాబు, గాదెపాక మధు, తాటికాయల బాబు, తాటికాయల ఎల్లయ్య, యాకయ్య, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలి

స్టేషన్ ఘన్‌పూర్, ఫిబ్రవరి 4 : స్టేషన్ ఘన్‌పూర్, శివునిపల్లి, చాగల్ గ్రామాలను కలుపుతూ ఏర్పడిన స్టేషన్‌ఘన్‌పూర్ మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రజలు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ జీ రవీందర్ గౌడ్ కోరారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి, వరంగల్ ఎంపీ కడియం కావ్య సహకారంతో స్టేషన్‌ఘన్‌పూర్‌ను అభివృద్ధి చేస్తామన్నారు. మున్సిపాలిటీ పరిధిలో పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్ దీపాల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు. మున్సిపాలిటి పరిధిలో ఎలాంటి సమస్యలు ఉన్నా నేరుగా తన దృష్టికి తీసుకురావొచ్చని ఆయన ప్రజలకు సూచించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ రవీందర్‌గౌడ్‌ను పంచాయతీ కార్యదర్శులు లింగయ్య, ఏదునూరి సత్యంతోపాటు తెల్లాకుల రామకృష్ణ, కొలిపాక సతీశ్, బాల కృష్ణ తదితరులు సత్కరించారు.

గ్యాస్ సిలిండర్ పేలి మూడిండ్లు దగ్ధం

- నగదుతోసహా సుమారు రూ.50 లక్షల ఆస్తి నష్టం
- ఇప్పగూడెంలో ఘటన

మంటల్లో కాలిపోతున్న ఇండ్లు

వివరాలు తెలుసుకుంటున్న తహసీల్దార్

స్టేషన్ ఘన్‌పూర్, ఫిబ్రవరి 3 : ప్రమాదవశాత్తు వంటగ్యాస్ సిలిండర్ పేలి మూడు ఇండ్లు దగ్ధమైన ఘటన మండలంలోని ఇప్పగూడెంలో సోమవారం జరిగింది. దీంతో బాధిత కుటుంబాలు నిరాశ్రయులయ్యారు. బాధితులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇప్పగూడేనికి చెందిన తోడెంగల నర్సయ్య, కొమురమ్మ దంపతులకు మల్లయ్య, వెంకటయ్య, కృష్ణమూర్తి, ఐలయ్య నలుగురు కుమారులు. వెంకటయ్య వేరే చోట ఉం టుండగా మిగిలిన ముగ్గురు కుమారులు ఒకే చోట పెంకుటిల్లులో ఉంటున్నారు. వీరి తల్లి కొమురమ్మకు పక్కనే గుడిసె వేయగా అందులో ఉంటున్నది. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం 10 గంటల సమయంలో కృష్ణమూర్తి ఇంట్లో వంట గ్యాస్ సిలెండర్ పేలి ఇంటికి మంటలు అంటుకున్నాయి. దీంతో కొమురమ్మ కేకలు వేయడంతో చుట్టు పక్కల వారు వచ్చి ఆమెను బయటకు తీసుకొచ్చి ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. అందరివి పెంకుటిండ్లు కావడంతో మంటలు వ్యాపించి పూర్తిగా కాలిపోయాయి. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. ఈ ఘటనలో మల్లయ్య తన కుమారుడి వివాహం కోసం రూ. 20 లక్షలు ఇంట్లో దాచగా వాటితో పాటు విలువైన వస్తువులు కాలిపోయాయి. కృష్ణమూర్తి తన కూతురు వివాహం కోసం ఇటీవల 30 గుంటల వ్యవసాయ భూమిని అమ్మగా వచ్చిన రూ.20 లక్షలు, రూ.10 లక్షల అప్పు పత్రాలు, సామ గ్రి కాలిపోయాయి. ఐలయ్యకు చెందిన రూ.5 లక్షల విలువైన టెంట్ హౌస్ సామగ్రి దగ్ధమైనట్లు బాధితులు రోదిస్తూ తెలిపారు. మరోవైపు 60 క్వింటాళ్ల బియ్యం సైతం అగ్నికి ఆహుతయ్యాయి.

ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలి : రాజయ్య

అగ్ని ప్రమాదం ఘటన తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి బాధిత కుటుంబాలను పరామర్శించారు. బాధితులకు రూ.5 వేల నగదు అందించారు. వీరికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసి ఆదుకోవాలని స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీవో డీఎస్ వెంకన్నను కోరారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షు డు మాచర్ల గణేశ్, మా జీ జడ్పీటీసీ రవి, కనకం గణేశ్, మహిపాష తదితరులు ఉన్నారు.

కలెక్టర్‌కు నివేదిక పంపిస్తాం..

అగ్ని ప్రమాద విషయం తెలుసుకున్న తహసీల్దార్ వెంకటేశ్వర్లు ఆర్ఐ శ్రీకాంత్‌తో కలిసి దగ్ధమైన ఇళ్లను పరిశీలించారు. బాధిత కుటుంబాలకు తక్షణ సాయంగా రూ.5 వేలు, 50 కిలోల బియ్యం అందించారు. కలెక్టర్‌కు నివేదికను పంపించి న్యాయం చేస్తామన్నారు.

బాధితులకు రూ.20 లక్షలు ఇవ్వాలి : సీపీఎం

మల్లయ్య, కృష్ణమూర్తి, ఐలయ్యకు చెందిన ఇండ్లు, నగదు, సామగ్రి కాలిపోయాయని సీపీఎం మండల కార్యదర్శి మునిగెల రమేశ్, గ్రామ కార్యదర్శి కోడెపాక యాకయ్య తెలిపారు. బాధిత కుటుంబాలకు రూ.20 లక్షల చొప్పున నష్టపరిహారం అందించాలని కోరారు. ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసి ఆదుకోవాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

బీసీ కులగణన సర్వేలో పారదర్శకత లేదు

బీఆర్ఎస్ మండల నాయకుడు బస్వ మల్లేశ్

దేవరుప్పుల, ఫిబ్రవరి 3: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన బీసీ కులగణన సర్వేలో పారదర్శకత లోపించిందని బీఆర్ఎస్ మండల నాయకుడు బస్వ మల్లేశ్ విమర్శించారు. సోమవారం ఆయన 'నమస్తే తెలంగాణ'తో మాట్లాడారు. రాష్ట్రంలో ఇంకా 16 లక్షల (ఇంకా 3 శాతం) కుటుంబాలను సర్వే చేయలేదని ప్రభుత్వం ఒప్పకోవడంతోనే వాస్తవం వెలుగుచూసిందన్నారు. గ్రామాలు, పట్టణాల్లో ఇంతకు రెట్టింపు సంఖ్యలో కుటుంబాలున్నాయని, అక్కడ సర్వే చేయకపోవడం శోచనీయమన్నారు. సర్వే సమయంలో ఇండ్లకు స్టిక్కరింగ్ చేసినా ఇంకా అనేక ఇళ్లకు అధికారులు రాలేదని తెలిపారు. మరోమారు బీసీ గణనపై సమగ్ర సర్వే చేయిస్తేనే లెక్క తేలుతుందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తారా అనే విషయం సర్కారు తేల్చి చెప్పడం లేదని మల్లేశ్ వ్యాఖ్యానించారు.

ఇంటర్ ప్రాక్టికల్స్ ప్రారంభం

జనగామ చౌరస్తా, ఫిబ్రవరి 3 : ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదివే జనరల్, ఒకేషనల్ విభాగం విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు జిల్లాలోని 11 పరీక్ష కేంద్రాల్లో ఉదయం జరిగిన ప్రాక్టికల్స్‌కు జనరల్ అండ్ ఒకేషనల్ విభాగం విద్యార్థులు మొత్తం 1206 మందికిగాను 1102 మంది హాజరుకాగా, 104 మంది విద్యార్థులు గైర్హాజర్ అయినట్లు డీఐఈవో జితేందర్‌రెడ్డి తెలిపారు. మధ్యాహ్నం జరిగిన ప్రాక్టికల్ పరీక్షలకు జనరల్ అండ్ ఒకేషనల్ విభాగం విద్యార్థులు మొత్తం 1086 మందికిగాను 1043 మంది హాజరుకాగా, 43 మంది గైర్హాజర్ అయినట్లు ఆయన పేర్కొన్నారు. పాలకుర్తి, కొడకండ్ల ప్రాక్టికల్ పరీక్ష కేంద్రాల్లో ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు తనిఖీలు చేపట్టగా, డీఈసీ మెంబర్లు స్టేషన్ ఘన్‌పూర్‌లో తనిఖీలు నిర్వహించారు.